ఆమడదూరంలో అందమైన భవనం


కొత్తగా నిర్మించిన పాఠశాల భవనం


ఉపాధ్యాయులు ఉండే గది ఇదే..

- గ్రహణం వీడని సర్కారు బడి నిర్మాణం
- విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇబ్బందులు
- తొంభై శాతం పనులు పూర్తి
- భవనాలు అప్పగించని కార్పొరేట్ సంస్థ

ముస్తాబాద్: సామాజిక బాధ్యతగా కార్పొరేట్ కంపెనీ చేపట్టిన పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తి కావడం లేదు. కోట్లాది రూపాయలతో చేపట్టినా తుదిదశలో పనులకు మోక్షం లభించడం లేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పాత భవనాన్ని కూల్చివేసి కొత్త భవనాల నిర్మాణాలను ప్రారంభించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) నిధులు రూ.తో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ చొరవతో అరబిందో ఫార్మా ఫౌండేషన్ బడినే నిర్మించింది. రెండేళ్ల క్రితం మొదలైన పనులు చివరిదశకు వచ్చాయి. గ్రీన్‌మ్యాట్, ఖోఖో, వాలీబాల్ మైదానాలు పనులు చేస్తే వందశాతం పనులు పూర్తవుతాయి. కేవలం గ్రీన్‌మ్యాట్, ఆట స్థలం పనులు చేపడితే సరిపోతుంది.

విద్యార్థుల తిప్పలు..

అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఎంతో బాధ్యతతో ప్రభుత్వ పాఠశాలను పునర్నిర్మించేందుకు పనులు చేపట్టింది. రెండేళ్ల క్రితం కొత్త భవనాలు నిర్మించేందుకు పాత భవనాలు కూల్చివేశారు. గ్రీన్‌మ్యాట్, గ్రౌండ్ పనుల పెండింగ్‌లో ఉండటం, పూర్తిచేసిన భవనాలు అప్పగించకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బాలుర పాఠశాల విద్యార్థులు పక్కనే ఉన్న బాలికల జెడ్పీ స్కూల్‌లో చదువుతున్నారు. సరైన గదులు లేక స్టోర్ రూంలోనే ఉపాధ్యాయులు ఉండే పరిస్థితి. ఆరుబయట విద్యార్థులు భోజనాలు చేస్తున్నారు. కాంపౌండ్ లేకపోవడంతో రాత్రివేళల్లో మందుబాబులకు అడ్డాగా మారింది. డైనింగ్ హాల్ అద్దాలను ఆకతాయిలు పగులగొట్టారు.

పూర్తయిన పనులివే..

మండలకేంద్రంలోఅందమైన భవనాన్ని నిర్మించారు. అరవిందో ఫార్మ కంపెనీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనులు అందరినీ ఆకర్షిస్తున్నాయి. 16 తరగతి గదులు, ల్యాబ్, లైబ్రరీ, డైనింగ్‌హాల్, డ్యూయల్ డెస్కులు, టేబుల్స్, డిజిటల్ రూం వంటి అత్యాధునిక పనులు పూర్తయ్యాయి. ఎలక్ట్రిసిటీ పనులు పూర్తిచేశారు. అయితే నవంబర్‌లో పాఠశాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయగా, ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. దీంతో పాఠశాల హెచ్ఎం ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి విద్యార్థులకు కలుగుతున్న ఇబ్బందులను వివరించారు. మిగులు పనులు చేయాలని కంపెనీ ప్రతినిధులను కోరారు. అసంపూర్తి పనులతో బాలుర పాఠశాలలో 95 మంది, బాలికల పాఠశాలలో 325 మంది విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు.

ఇబ్బంది పడుతున్నారు



అధికారులు, కంపెనీ ప్రతినిధులను పూర్తయిన గదులను అప్పగించాలని విజ్ఞప్తి చేశాం. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. మిగులు పనులు చేసిన అనంతరమే భవనాలను అప్పగిస్తామని తెలిపారు. బోధన, మ ధ్యాహ్న భోజన నిర్వహణ ఇబ్బందిగా మారింది.

– రాజిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు

తొందరగా ప్రారంభించాలి



కార్పొరేట్ కంపెనీ అందమైన భవనాలు నిర్మించినందుకు ఆనందంగా ఉంది. ఆట స్థలం పనులు పూర్తిచేస్తే బాగుంటుంది. రెండేళ్లుగా ఇబ్బంది పడుతున్నాం. తొందరగా ప్రారంభిస్తే అందరికీ బాగుంటుంది. బయటనే మధ్యాహ్న భోజనం చేస్తున్నాం. టాయిలెట్స్ లేవు.

– రాఘవ, తొమ్మిదోతరగతి

కొత్త గదులు అప్పగించాలి



కొత్త గదులు అప్పగిస్తే బాగుండు. వేరే పాఠశాలలో మేం చదువుకోవడంతో పాటు బోధనకు ఇబ్బందిగా మారింది. కొత్తగా ఎవరైనా పాఠశాలలో చేరాలంటే భయపడుతున్నారు. మిగతా పనులు పూర్తికాకున్నా తరగతి గదులు అప్పగిస్తే ఇబ్బందులు తీరుతాయి.


– పుష్పలత, పదోతరగతి

పేద ప్రజలకు అందుబాటులో వైద్యం


పల్లె దవాఖాన ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: పల్లె దవాఖానల ద్వారా పేద ప్రజలకు వైద్యం అందుబాటులో ఉంటుందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మారుపాక గ్రామంలోని పల్లె దవాఖానను ప్రారంభించారు. గ్రామంలోని సీసీ రోడ్లకు జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతో కలిసి భూమిపూజ చేశారు. గ్రామ ప్రజలకు అనారోగ్య సమస్యలుంటే దూర ప్రాంతాలకు వెళ్లకుండా అందుబాటులోనే చికిత్స జరుగుతుందన్నారు. బ్రిడ్జి నిర్మాణాలతో పాటు రైతులకు ఉపయోగపడే వరి కల్లాలను త్వరలో నిర్మించుకుందామని అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామన్నారు. ఎంపీపీ బూర వజ్రమ్మ, సర్పంచ్ చెన్నమనేని స్వయంప్రభ, ముడికె చంద్రశేఖర్, బూర బాబు, పవన్, సత్తయ్య తదితరులున్నారు.

బైండోవర్ అతిక్రమించిన ఐదుగురికి జరిమానా


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై శ్రీకాంత్

బోయినపల్లి(చొప్పదండి): బైండోవర్ నియమావళిని అతిక్రమించిన మండలంలోని ఐదుగురు వ్యక్తులకు తహసీల్దార్ పుష్పలత రూ.2.50లక్షల జరిమానా విధించినట్లు ఎస్సై ఎల్.శ్రీకాంత్ సోమవారం సాయంత్రం తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయిస్తున్న రత్నంపేటకు చెందిన కందారపు తిరుపతి, బూర్గుపల్లికి చెందిన నాగయ్య, మల్కాపూర్‌కు చెందిన తిరుపతిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. తరచూ భూముల విషయంలో గొడవలు పడుతున్న రామన్నపేటకు చెందిన కమలాకర్, లింగారెడ్డిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. బైండోవర్ నిబంధనలను అతిక్రమించి తిరిగి ఆరు నెలల్లోపు మళ్లీ బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయించడంతో తిరుపతి, నాగయ్య, తిరుపతికి తలా రూ.50వేల చొప్పున, భూముల విషయంలో మళ్లీ గొడవలు పడ్డ కమలాకర్, లింగారెడ్డికి తలా రూ.50వేల చొప్పున తహసీల్దార్ జరిమానా విధించారన్నారు. 7 రోజుల్లోపు చెల్లించాలని, సకాలంలో జరిమానా చెల్లించకుంటే రిమాండ్ చేసి జైలుకు పంపుతామని అన్నారు.

‘సెస్’ ముందు ఆందోళన


ఎస్ఎస్ఐ యూనిట్ల యజమానుల ఆందోళన

సిరిసిల్లటౌన్: సెస్ అధికారుల తీరుపై సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. విద్యుత్ బకాయిలు చెల్లించాలంటూ సోమవారం పలువురు ఎస్ఎస్ఐ యూనిట్ల కరెంట్ కట్ చేయడంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాం నుంచి బకాయిలున్నాయని, కొత్త ప్రభుత్వం రాగానే తమపై సెస్ పాలకవర్గం, అధికార యంత్రాంగం పగబట్టినట్టు ప్రవర్తిస్తున్నాయన్నారు. వెంటనే కరెంట్ సరఫరా చేయాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సురేందర్‌రావును డిమాండ్ చేశారు. ఇరు పక్షాలు చర్చలు జరుపుతున్నాయి.

క్లుప్తంగా

నేడు రేబీస్ వ్యాధినిరోధక టీకాలు

వేములవాడఅర్బన్: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని మండల పశు వైద్యాధికారి కార్యాలయంలో మంగళవారం రేబీస్ వ్యాధినిరోధక ఉచిత టీకాలను పెంపుడు కుక్కలకు ఇవ్వనున్నట్లు మండల పశు వైద్యాధికారి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. పెంపుడు కుక్కలను తీసుకొచ్చి టీకాలను వేయించుకోవాలని కోరారు.

అక్రమ వెంచర్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

కోనరావుపేట: కొలనూర్‌లో అక్రమ వెంచర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని వీరవేణి తిరుపతి యాదవ్, బొల్గం కమలాకర్, తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, వి.తిరుపతి, గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నెంబర్లు 704ఏ, 472ఈ, 671డీ, 702సీ, 732లో గల 12 ఎకరాల వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని అన్నారు. ఈ భూమిలో గ్రామ పంచాయతీకి 1.08 ఎకరాల భూమి రావాల్సి ఉందన్నారు. ఈ విషయమై పలుమార్లు ఫిర్యాదు చేశామని అన్నారు.

పంచాయతీ కార్మికులకు సన్మానం



గంభీరావుపేట: నర్మాల గ్రామ పంచాయతీ కార్మికులకు పాలకవర్గ సభ్యులు సోమవారం ఘనంగా సన్మానం చేశారు. తమ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఇన్నాళ్లు తమకు సహకరించిన కార్మికులు, ఉద్యోగులు, సిబ్బందికి శాలువాలతో సత్కారం చేశారు. సర్పంచ్ ఎడబోయిన రాజు, ఉప సర్పంచ్ పురం శోభారాణి, జీపీ కోఆప్షన్ సభ్యుడు రాజబోయిన ఆంజనేయులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన బీఎస్పీ నాయకులు



తంగళ్లపల్లి: తంగళ్లపల్లికి నూతనంగా నియామకమైన ఎస్సై ప్రశాంత్‌రెడ్డిని సోమవారం బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు గుండు ప్రేమ్‌కుమార్, నాయకులు కలిశారు. ఎస్సైని శాలువాతో సన్మానించారు. బీఎస్పీ ఉపాధ్యక్షుడు మునిగె భాస్కర్, ప్రధాన కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి, ఈసీ మెంబర్ రమేశ్, కుమార్, శంకర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ కుటుంబానికి చేయూత



కోనరావుపేట: కొలనూర్ గ్రామానికి చెందిన దివ్యాంగుడైన మేర్గు ఆంజనేయులు తల్లి ఇటీవల మృతిచెందగా.. వారి కుటుంబానికి జిల్లా వికలాంగుల సంఘం నాయకులు చేయూతనందించారు. సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. మన్మోహన్, రాజు, బాలచందర్, మాదాస్ రాజేశ్, రాజేందర్, హరిప్రసాద్, నరేశ్, శ్రీనివాస్, తిరుపతి తదితరులున్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



సిరిసిల్లక్రైం: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కొత్త సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా విద్యాధికారి రమేశ్ సోమవారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డీఈవోకు విన్నవించినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు యాదగిరిగౌడ్, ప్రధాన కార్యదర్శి లాల శ్రీనివాస్, భూపతి, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పరీక్ష

వేములవాడఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈఎల్‌టీఏ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండలస్థాయి ప్రతిభ పరీక్షను సోమవారం నిర్వహించారు. మండలస్థాయిలో గెలుపొందిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంఈవో బన్నాజీ, ఉపాధ్యాయులు యాదగిరి, కోటేశ్వర్ తదితరులున్నారు.

అక్రమంగా మట్టి తరలింపు


రామన్నపల్లె చెరువులో పొక్లెయిన్‌తో మట్టి తవ్వకం

తంగళ్లపల్లి: రామన్నపల్లె గ్రామంలోని ఎల్లమ్మ చెరువులో జేసీబీలు, పొక్లెయిన్లతో యథేచ్ఛగా మట్టి తరలిస్తున్నారు. కానీ చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు మాత్రం అటువైపు చూడటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెరువులో మట్టి తరలింపును అడ్డుకోవాలని కోరుతున్నారు.

బోరు మోటారు ప్రారంభం


చిన్నలింగాపూర్‌లో బోరు మోటారు ప్రారంభిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

తంగళ్లపల్లి: చిన్నలింగాపూర్ గ్రామంలో ఎంపీటీసీ నిధులతో బోరు మోటారు, మినీ వాటర్ ట్యాంక్ ఏర్పాటుకు సోమవారం ఎంపీటీసీ భైరినేని రాము, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి భూమిపూజ చేశారు. ముదిరాజ్ సంఘం వద్ద బోరు, సముద్రాల సైదయ్య ఇంటి దగ్గర మినీ వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్మాని రాంలింగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, జిల్లా నాయకులు వైద్య శివప్రసాద్, శ్రీకాంత్‌గౌడ్, బొంగరపు శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, పరశురాములు, భరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బోరుబావి తవ్వకం పనులు ప్రారంభం

వీర్నపల్లి: బాబాయిచెరువుతండా గ్రామంలో జెడ్పీ నిధుల నుంచి బోరుబావి తవ్వకం పనులను శనివారం జెడ్పీ కో–ఆప్షన్ ఎండీ చాద్ పాషా ప్రారంభించారు. రానున్న వేసవికాలంలో తండావాసులకు నీటి సమస్య రాకుండా ఉండేందుకు రూ.90వేలతో బోరుబావి, కస్తూర్బాగాంధీ పాఠశాలలో రాత్రి సమయంలో విద్యార్థినులకు ఇబ్బంది లేకుండా రూ.లక్షతో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశామన్నారు. సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, గ్రామ సర్పంచ్ భూక్య లక్ష్మి, పాటి దినాకర్, ఎంపీటీసీ మల్లారపు అరుణ్ కుమార్, ఉప సర్పంచ్ బోయిని రవి, బంజార సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌నాయక్, కేజీబీవీ ఎస్‌వో నీలిమ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేటలో..

గంభీరావుపేట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సంఘ భవన ప్రాంగణంలో బోరుబావి తవ్వకం పనులను సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దోసల లత, ఉప సర్పంచ్ నాగరాజుగౌడ్, నాయకులు రెడ్డిమల్ల రాజనర్సు, రాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

బోయినపల్లి: మల్లాపూర్ గ్రామస్తులతో పాటు అనుబంధ రేగులపల్లి గ్రామస్తులు సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. గ్రామ సమస్యలపై వినతి పత్రం అందించారు. మల్లాపూర్ ప్రధాన డ్రెయినేజీ నీరు రైతుల పొలంలోకి కాకుండా సాఫీగా వాగులోకి వెళ్లడానికి గాను మరో డ్రెయినేజీ నిర్మించాలని కోరారు. రేగులపల్లిలో సీసీ రోడ్డు నిర్మించాలన్నారు. కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వేసిరెడ్డి మాధవరెడ్డి, వార్డు సభ్యులు మాధవి, ఐల శివరామ్, ఇల్లెందుల మల్లయ్య, దాసరి బాబు, ఐల రామ్‌కిషన్, అందెకి సాయి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి


క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

ఎల్లారెడ్డిపేట: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని రాణించాలని, క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేటలో శనివారం ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలు జరగనుండగా.. క్రీడాకారులు సోమవారం సాధన చేశారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి ఉన్నారు.

వేములవాడ విద్యార్థికి జాతీయస్థాయి చాంపియన్‌షిప్ కప్


కప్ అందుకుంటున్న అప్సర్

వేములవాడ: మంచిర్యాల జిల్లా కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తన తండ్రి కొక్కిరాల రఘుపతి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో వేములవాడకు చెందిన ఎండీ అప్సర్ జాతీయస్థాయి కప్ సాధించినట్లు కరాటే మాస్టర్ ఎంఏ మన్నాన్ సోమవారం తెలిపారు. ఈ పోటీలకు 8 రాష్ట్రాల నుంచి 1,200 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు చెప్పారు. గ్రాండ్ చాంపియన్‌షిప్ కప్ అండర్–14 బ్లాక్‌బెల్ట్ విభాగంలో అప్సర్ విజేతగా నిలిచినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అప్సర్‌ను అభినందించారు. వేములవాడకు చెందిన విద్యార్థులు సాయిహర్షిత్, మనీరూప్, సూర్య జయచంద్ర, జస్వంత్ బంగారు పతకాలు సాధించారు. టీఎస్కేడి(కాయ్) రాష్ట్ర అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అబ్దుల్ మన్నాన్, ఎం.ప్రవీణ్, ప్రసన్న, టోర్నమెంట్ రెఫరీ, కమిషనర్ మొండయ్య, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, టోర్నమెంట్ ఆర్గనైజర్ ఎం.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణ


సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీఐ

ముస్తాబాద్: సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను నియంత్రించొచ్చని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ అన్నారు. మోహినికుంట కేజీఆర్ కాలనీలో సర్పంచ్ కల్వకుంట్ల వనజ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం ప్రారంభించారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. చోరీల నియంత్రణకు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. నేరం జరిగిన తర్వాత దోషులు తప్పించుకునే వీల్లేదన్నారు. ఇప్పటివరకు జరిగిన చోరీలు, ఇతర నేరాల్లో సీసీ కెమెరాల ఫుటేజీ ఎంతగానో ఉపయోగపడిందని అన్నారు. ఉప సర్పంచ్ సంధ్య, ఎస్సై శేఖర్‌రెడ్డి, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు గోపాల్‌రావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనం ప్రారంభం


ప్రారంభిస్తున్న కవ్వంపల్లి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఇల్లంతకుంట మండలంలో సోమవారం సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా కేశనపల్లె గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించారు. జవారిపేట గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, సర్పంచ్ పోతరాజు ఎల్లవ్వ నర్సయ్య, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య, కాంగ్రెస్ మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సుగా చందుర్తి వాసి ఎంపిక


శిల్ప

చందుర్తి: మండల కేంద్రానికి చెందిన మార్త శిల్ప స్టాఫ్‌నర్సుగా ఎంపికయింది. సోమవారం వెల్లడించిన ఫలితాల్లో ఆమె ఎంపిక కావడాన్ని హర్షిస్తూ చందుర్తి పెరుక సంఘం అధ్యక్షుడు మార్త మల్లేశం పెరుక కమ్యూనిటీ భవనంలో సన్మాన సభ ఏర్పాటు చేసి సన్మానించారు. మల్లేశం మాట్లాడుతూ.. ఇదే సంకల్పంతో వైద్య సేవలందించి ఉన్నత స్థానాలను కైవసం చేసుకోవాలని కోరారు.

ముస్తాబాద్ వాసికి డాక్టరేట్


హరికృష్ణ


ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ పట్టణానికి చెందిన చందా హరికృష్ణకు బ్రిటన్‌లో భారతీయ డాక్టరేట్ కౌన్సిల్ పురస్కారం దక్కింది. లండన్‌లో పదిహేను సంవత్సరాలుగా ఫార్మ రంగంలో విశేష కృషి చేస్తున్న చందా హరికృష్ణ సేవలను గుర్తించిన భారతీయ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. ఫార్మ ఉత్పత్తుల్లో డాక్టర్ హరికృష్ణ అనేక ఆవిష్కరణలను సాధించారని ఆయన తండ్రి చందా విజయ్‌కుమార్ తెలిపారు. భారతీయ కార్పొరేట్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ద్వారా డాక్టరేట్ పట్టా అందుకుంటున్న హరికృష్ణ ముస్తాబాద్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఆర్య వైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి

సిరిసిల్లక్రైం: రోడ్డు ప్రమాదాలు నియంత్రించేందుకు విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలని, దీంతో సమాజంలో ప్రమాదాలు తగ్గుముఖం పడుతాయని సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి అన్నారు. ట్రాఫిక్ సిగ్నల్, నిబంధనలపై సిరిసిల్ల పట్టణంలోని మహర్షి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని, హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, కారులో వెళ్లేప్పుడు సీటు బెల్టు ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐవైఎస్‌వో నిర్వాహకులు ఓఝా, పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.


సంఘాలు-కార్యవర్గాలు

ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా పర్శరాం


నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆది

వేములవాడరూరల్: కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా మానుపాటి పర్శరాంను నియమిస్తూ నియామక పత్రాన్ని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అందజేశారు. జిల్లా అధ్యక్షుడు గుగ్లోతు హరీలాల్‌నాయక్ నియమించారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ బలోపేతం కోసం పని చేస్తానని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు సంగ స్వామి, సోషల్ మీడియా కన్వీనర్ చిలుక ప్రభాకర్, మానుపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



సిరిసిల్లకల్చరల్: తుర్క కాశీ కమిటీ రాష్ట్ర కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలో సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ బడేసాహెబ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా సయ్యద్ హుస్సేన్, ఉపాధ్యక్షులుగా సయ్యద్ షరీఫ్, సయ్యద్ జహంగీర్, షేక్ షాదుల్లా, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ షరీఫ్, సహాయ కార్యదర్శిగా అలీమ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హుస్సేన్, ప్రచార కార్యదర్శిగా ఉమర్ ఖాసీం ఎన్నికయ్యారు.